

కోయంబత్తూరు చేరుకున్న విపత్తుల నివారణ బృందం

కోవై, నీలగిరి జిల్లాలకు

రెండు రోజులు రెడ్అలర్ట్!

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో నీలగిరి, కోయంబత్తూరు జిల్లాలకు జాతీయ విపత్తుల బృందం, రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం ముందు జాగ్రత్త చర్యలు ప్రారంభించారు. వీరంతా నీలగిరి జిల్లాలో భారీ వర్షాల కారణంగా నష్టపోయే అవకాశాలున్న 253 ప్రాంతాల్లో నిఘా వేశారు. బంగాళాఖాతంలో అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం కారణంగా శని, ఆదివారాల్లో కోవై, నీలగిరి జిల్లాల్లో ఉరుములు మెరుపులు, పెనుగాలులతో కుండపోత వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు హెచ్చరించారు. దీంతో రెండు జిల్లాల అధికారులంతా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక రక్షణ బృందం ఏర్పాటైంది. బాధితులను సకాలంలో ఆదుకునేలా 1077 నెంబర్తో హెల్ప్లైన్ కూడా ఏర్పాటు చేశారు. బాధితుల కోసం 430 సహాయక శిబిరాలు కూడా సిద్ధం చేశారు. పోలీసు, అగ్నిమాపక శాఖ, రహదారుల శాఖ, విద్యుత్ శాఖ, ప్రజాపనుల శాఖ అధికారులు, సిబ్బంది వర్షబాధిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు 24 గంటలపాటు సిద్ధంగా ఉండాలని జిల్లా అధికారులు పేర్కొన్నారు. పెనుగాలులకు చెట్లు కూలిపడితే వాటిని తొలగించేందుకు అవసరమైన సామగ్రి కూడా సిద్ధం చేయాలని అగ్నిమాపక దళం, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులు కూడా ఆదేశాలిచ్చారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

● కేంద్రమంత్రి కమలేష్ పాశ్వాన్

వాషర్మెన్పేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టని మహిళలు, దార్శనిక డ్రోన్ దీదీ చొరవతో ఇప్పుడు డ్రోన్లను ఎగురేస్తున్నారని, అన్ని రంగాల్లోనూ మహిళలు ముందంజలో వున్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి కమలేష్ పాశ్వాన్ పేర్కొన్నారు. చెన్నైలోని 'గరుడ ఏరోస్పేస్'కు చెందిన అగ్రి-డ్రోన్ స్వదేశీ సదుపాయాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అదే విధంగా 300 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ను, 'ట్రైన్ ది ట్రైనర్' కార్యక్రమాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గరుడ ఏరోస్పేస్ సీఈవో అగ్నీశ్వర్ ఎంతోమందికి ఉపాధి కల్పించడమనేది యువతకు సాధికారత కల్పించాలనే ప్రధానమంత్రి దార్శనికతను నెరవేర్చే దిశగా ప్రశంసనీయమైన అడుగు అని అభినందించారు. అగ్నీశ్వర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. 2026 నాటికి లక్ష మేక్ ఇన్ ఇండియా డ్రోన్లను తయారు చేయాలనే దార్శనికతను ప్రధానితమకు 2022లోనే తమకు అందించారని వివరించారు.



కార్యక్రమంలో కేంద్రమంత్రి

అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే సన్నాహం

● నియోజకవర్గం ఇన్ఛార్జులతో స్టాలిన్ భేటీ



అరివాలయంలో నియోజకవర్గం ఇన్ఛార్జులతో మాట్లాడుతున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇక పదినెలల గడువు మాత్రమే ఉండటంతో పాలకపక్షమైన డీఎంకే 200 నియోజకవర్గాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో వ్యూహరచనలు చేస్తోంది. ఆ మేరకు 'ఉడన్ పిరప్పే వా' (తోబుట్టువా రా) అనే పేరుతో పార్టీ జిల్లా ఇన్ఛార్జులతో పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ముఖాముఖీ భేటీలు నిర్వహించ తలపెట్టారు. ఇప్పటికే రాష్ట్రాన్ని ఎనిమిది జోన్లుగా విభజించి, 234 నియోజకవర్గాలలో పార్టీ పర్యవేక్షకులను నియమించారు. వీరంతా ఆయా జిల్లాల కార్యదర్శులు, బూత్కమిటీ ఇన్ఛార్జులు, జిల్లా ఇన్ఛార్జులతో కలిసి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసేందుకు బహిరంగ సభలు నిర్వహిస్తూ ఇంటింటా కరపత్రాల పంపిణీ చేస్తూ ముమ్మర కార్యక్రమాలు చేపడుతున్నారు. మరో వైపు స్టాలిన్ పిలుపు మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 30 శాతం మంది కొత్త ఓటర్లకు పార్టీ సభ్యత్వం కల్పించే కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. ఇటీవల మదురైలో జరిగిన డీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో 200 సీట్లు గెలచుకునేలా పార్టీ శ్రేణులంతా ప్రచారం చేయాలని, త్వరలో నియోజకవర్గాల ఇన్ఛార్జులతో 'ఉడన్పిరప్పేవా' పేరుతో ఒన్టు వన్ ఇంటర్వ్యూలను అన్నా అరివాలయంలో జరుపనున్నామని స్టాలిన్ తెలిపారు. ఆ ప్రకారమే శుక్రవారం ఉదయం అన్నా అరివాలయంలో చిదంబరం,విల్లుపురం, ఉసిలంపట్టి నియోజకవర్గాల ఇన్ఛార్జులతో స్టాలిన్ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా సిట్టింగ్ ఎమ్మెల్యే పనితీరు, స్థానిక ప్రజల్లో అతనికున్న పలుకుబడి తదితర వివరాలను స్టాలిన్ అడిగి తెలుసుకున్నారు.ఈ ఒన్టు వన్ ఇంటర్వ్యూలను నిర్వహించడంలో స్టాలిన్తో పాటు పార్టీ సీనియర్ నేతలు ఆర్ఎస్ భారతి,టీకేఎస్ ఇలంగోవన్కూడా పాలుపంచుకున్నారు.

అమిత్ షాకు స్వాగతం పలికిన రౌడీ అరెస్టు

అడయార్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మదురై వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు స్వాగతం పలికిన పేరుమోసిన రౌడీ మిలగాయిపొడి వెంకటేష్ను ఆవడి పోలీసులు అరెస్టు చేశారు. ఓ వ్యాపారిని బెదిరించి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలతో అదుపులోకి తీసుకున్నారు. ఆవడి కమిషనరేట్ పరిధిలో వెంకటేష్పై దోపిడీ, బెదిరింపు కేసులు పెండింగ్లో ఉన్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం రెడ్హిల్స్ అసిస్టెంట్ కమిషనర్ రాజా రాబర్ట్, ఎన్నూరు అసిస్టెంట్ కమిషనర్ వీరకుమార్ సారథ్యంలో ప్రత్యేక బృందం పాడియనల్లూరులోని వెంకటేష్ ఇంటికి వెళ్ళి, ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలావుండగా, గురువారం ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పానసోనిక్ డీలర్ దీపన్ చక్రవర్తి ఒక ఫిర్యాదు చేశారు. అందులో గణపతిలాల్ అనే వ్యక్తికి రూ.50 లక్షల విలువైన వస్తువులను సరఫరా చేయగా, ఆ డబ్బులు తిరిగి ఇవ్వలేదు. అదేవిధంగా గోకుల్దాస్ అనే వ్యక్తి కూడా గణపతిలాల్కు కొన్ని వస్తువులు సరఫరా చేయగా, వాటికి కూడా డబ్బులు చెల్లించలేదు. దీంతో తామిద్దరం వెంకటేష్ను కలిసి విషయం చెప్పగా, 10 శాతం కమిషన్ ఇస్తే డబ్బులు వసూలు చేయిస్తాననడంతో తాము కూడా అంగీకరించాం. ఇందులో భాగంగా ముందుగా రూ.లక్ష ఇచ్చామనీ, ఆ తర్వాత తమ డబ్బులు వసూలు చేసి ఇచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ తర్వాత గణపతిలాల్తో కలిసి తమను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు వెంకటేష్ను శుక్రవారం అరెస్టు చేశారు.

యువ కామరాజర్ అంటూ పొగడ్తలు వద్దు

● టీవీకే అధినేత విజయ్ హితవు ● టెన్త్, ప్లస్-2 విద్యార్థులకు నగదు కానుకలు



ఓ విద్యార్థిని కుటుంబీకులతో విజయ్

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న ఎన్నికలు గురించి ప్రస్తావించవద్దని, తనను 'యువనేత కామరాజర్' అంటూ తనపై పొగడ్తల వర్షం కురిపించకూడదని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత, సినీ నటుడు విజయ్ విద్యార్థులకు హితవు పలికారు. శుక్రవారం ఉదయం మూడో విడతగా పదో తరగతి, ప్లస్-2 పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు విద్యా అవార్డులు, నగదు కానుకలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ మాట్లాడుతూ అహ్మదాబాద్లో జరిగిన విమాన ప్రమాదంలో 240 మంది మృతిచెందిన దుర్ఘటన దేశ ప్రజలందరినీ శోకసముద్రంలో పడేసిందన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ కాసేపు మౌనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత విజయ్ టెన్త్, ప్లస్-2 లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజయ్తో ఫొటోలు తీసుకునేందుకు పోటీపడ్డారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి, తమ పార్టీ గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, అదే విధంగా తనపై ఆదరాభిమానాలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులు తనను యువ కామరాజర్గా పిలువకూడదని హితవు పలికారు. విద్యార్థులు ఎల్లప్పుడూ విద్యపైనే దృష్టిసారించాలని, అప్పుడే వారంతా ఉన్నతస్థితికి చేరుకుంటారని అన్నారు. అహ్మదాబాద్ దుర్ఘటన కారణంగా తాను ఎక్కువగా మాట్లాడలేకపోతున్నానని, త్వరలో అందరినీ నేరుగా కలుసుకుంటానని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు.

మందుల వ్యర్థాలు పారబోస్తే గూండా చట్టం

● రుణవసూలులో అక్రమాలకు పాల్పడితే జైలే

● రెండు బిల్లులకు గవర్నర్ ఆమోదం

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఆమోదించిన రెండు చట్ట సవరణ బిల్లులను గవర్నర్ ఆర్ఎన్.రవి ఆమోదించారు. ఇటీవలి కాలంలో పొరుగురాష్ట్రాల నుండి మందుల వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడి పారబోసి వెళుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇలా రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో, నీటివనరులకు సమీపంలో బయోమెడికల్ వేస్ట్ పారబోసే వ్యక్తులపై గూండాచట్టం ప్రయోగించేలా ఏప్రిల్లో శాసనసభలో ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టి, ఏప్రిల్ 29న ఆమోదించారు. ఆ బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపారు. ఈ నేపథ్యంలో ఆ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇదే విధంగా నిర్బంధ రుణ వసూళ్ల పద్ధతులను నిరోధించేలా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఓ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు కూడా గవర్నర్ ఆమోదం కోసం పంపారు. ఈ బిల్లును సైతం గవర్నర్ ఆర్ఎన్ రవి శుక్రవారం ఆమోదించినట్లు రాజ్భవన్ ఓ ప్రకటన జారీ చేసింది.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

లారీని ఢీకొన్న కారు నలుగురి దుర్మరణం

● న్యాయమూర్తి సహా ఇద్దరికి గాయాలు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టాయపురం సమీపం మేల్కరంథై ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. తంజావూరు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి పూర్ణజయ ఆనంద్ తిరుచెందూర్ స్వామి దర్శనం కోసం కారులో బయల్దేరారు. ఆయనతో పాటు సెక్యూరిటీ గార్డు (కానిస్టేబుల్) నవీన్కుమార్, న్యాయవాది ధనంజయన్ రామమూర్తి, కోర్టు ఉద్యోగి శ్రీధర్కుమార్ (37), కోర్టు అసిస్టెంట్ ఉదయసూర్య ఉన్నారు. కోర్టు రిజిస్ట్రేషన్ క్లర్క్ వసురామనాథన్ కారు డ్రైవ్ చేశారు. తిరుచెందూరులో స్వామివారి దర్శనానంతరం శుక్రవారం వేకువజాము స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 9 గంటల సమయంలో మేల్కరంథై ప్రాంతంలో కారు అకస్మాత్తుగా అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుకాగా, కోర్టు ఉద్యోగి శ్రీధర్కుమార్, వాసు రామనాథన్, సెక్యూరిటీ గార్డ్ నవీన్కుమార్, న్యాయవాది ధనజయన్ రామమూర్తి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. న్యాయమూర్తి పూర్ణ జయ ఆనంద్, కోర్టు ఉద్యోగి ఉదయసూర్యన్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మాసార్పట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. అలాగే, గాయపడిన న్యాయమూర్తి, కోర్టు ఉద్యోగిని చికిత్సలకు అరుప్పుకోటకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, లారీ డ్రైవర్ కడలూరు జిల్లా బొమ్మరకుడికి చెందిన విజయరాజ్ను అదుపులోకి తీసుకున్నారు.

ఊపిరి ఉన్నంతవరకూ పార్టీ అధ్యక్షుడు నేనే!

● పీఎంకే నేత రాందాస్

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది శాసనసభ ఎన్నికల తర్వాత అన్బుమణిని పార్టీ అధ్యక్షుడిగా చేద్దామని నిర్ణయించానని, అయితే పార్టీలో 99 శాతం మంది దానిని వ్యతిరేకిస్తుండటంతో ఊపిరున్నంతవరకూ తానే పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని నిర్ణయం తీసుకున్నానని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. దిండివనం తైలాపురం గార్డెన్ నివాసంలో ఆయన మాట్లాడుతూ పార్టీ మహానాడు తర్వాత అన్బుమణి ప్రవర్తనలో ఊహించని మార్పులు జరిగాయని, తనను వెన్నుపోటు పొడిచాడని, పార్టీపై ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు.

జూలై 25నుంచి అన్బుమణి పాదయాత్ర..

ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం పీఎంకే జిల్లా కార్యదర్శులతో సమావేశమైన అన్బుమణి డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీని అభివృద్ధి పరిచే దిశగా జూలై 25 నుండి వంద రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర జరపాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో జిల్లా కార్యదర్శులే కాకుండా సాధారణ కార్యకర్తలు కూడా తనవైపే ఉన్నారని పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్కు పరోక్షంగా తెలియజేసేందుకే అన్బుమణి ఈ పాదయాత్ర చేపడుతున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఆగస్టు నాటికి కూత్తంబాక్కం బస్టాండు

● మంత్రి శేఖర్బాబు



ప్రభుత్వ ముద్రణాలయ ఉద్యోగులకు నిర్మిస్తున్న నివాసాల పనులను పరిశీలిస్తున్న మంత్రులు శేఖర్బాబు, సామినాథన్, మేయర్ ప్రియ తదితరులు

అడయార్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూత్తంబాక్కంలో నిర్మిస్తున్న కొత్త బస్టాండు ఆగస్టు నెలాఖరు నాటికి అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్బాబు వెల్లడించారు. చెన్నై నగరాభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను శుక్రవారం పరిశీలించిన మంత్రి శేఖర్బాబు మీడియాతో మాట్లాడుతూ, సీఎండీఏ ఆధ్వర్యంలో నగరంలో 13 బస్టాండ్ల అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. పెరియార్ నగర్, తిరువిక నగర్లో అభివృద్ధి పనులు జూలై నెలాఖరునాటికి పూర్తి చేసేందుకు వేగవంతం చేసినట్టు ఆయన పేర్కొన్నారు హార్బర్, కొళత్తూరులో డయాలసిస్ కేంద్రాల నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. ఉత్తర చెన్నై అభివృద్ధిపై ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేకంగా దృష్టిసారించారన్నారు. ఇందులోభాగంగా కూత్తంబాక్కంలో నిర్మిస్తున్న కొత్త బస్టాండు ఆగస్టు నెలాఖరునాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. డీఎంకే ఇచ్చిన ఎన్నికల హామీల్లో 50 శాతం కూడా పూర్తి చేయలేదని బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై చేస్తున్న ఆరోపణలపై మంత్రి శేఖర్బాబు స్పందిస్తూ, నిజంగా నిద్రపోయేవారిని సులభంగా నిద్రలేపొచ్చు.. నిద్ర పోతున్నట్టుగా నటించేవారిని మాత్రం నిద్రలేపలేమన్నారు. అలాంటి వ్యక్తే అన్నామలై అని ఎద్దేవా చేశారు. డీఎంకే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి అన్ని రాష్ట్రాలు మెచ్చుకుంటున్నాయన్నారు. కానీ, రాష్ట్రంలోని అన్నాడీఎంకే, బీజేపీ నేతల కళ్ళకు కనిపించడం లేదని మంత్రి శేఖర్బాబు వ్యాఖ్యానించారు.



జంగ్పురా మదరాసీ క్యాంప్ ప్రాంతంలో ఇళ్ళ కూల్చివేత కారణంగా నిరాశ్రయులైన తమిళులకు ప్రత్యామ్నాయ స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, తమిళ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను కలిసి వినతి పత్రం సమర్పించిన డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఏకేఎస్ విజయన్.

రాజ్యసభ సభ్యులకు ఈపీఎస్ అభినందన



రాజ్యసభకు కొత్తగా ఎంపికైన ఇన్బదురై, ధనపాల్తో ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే తరుఫున రాజ్యసభకు కొత్తగా ఎంపికైన ఇన్బదురై, ధనపాల్లను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అభినందించారు. అన్నాడీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి ఇన్బదురై, చెంగల్పట్టు ఈస్ట్ పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ ఎం.ధనపాల్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎంపికైన విషయం తెలిసిందే. వీరు శుక్రవారం సేలం నెడుదాలై నగర్లోవున్న ఈపీఎస్ నివాసానికి వెళ్ళి ఎడప్పాడిని మర్యాదపూర్వకంగా కలవగా, ఈపీఎస్ వారిని అభినందించారు. రాజ్యసభలో రాష్ట్రప్రజల సమస్యలను ప్రస్తావించాలని, కేంద్రం నుండి అధిక నిధులు రాబట్టుకునేలా వ్యవహరించాలని వారికి ఈపీఎస్ సలహా ఇచ్చారు.

రైతు కష్టాలు స్టాలిన్కు తెలియవు: ఈపీఎస్

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలియవని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో మిథేన్ హైడ్రోకార్బన్ పథకాలను అనుమతించి పంటలు సమృద్ధిగా పండించిన డెల్టా జిల్లాలను ఎడారిగా మార్చేందుకు సీఎం స్టాలిన్ ప్రయత్నించారని, దీనిని వ్యతిరేకంగా న్యాయం కోసం రోడెక్కిన అన్నదాతలపై గూండా చట్టం ప్రయోగించారని ఈపీఎస్ ఆరోపించారు. ఈరోడ్ జిల్లా పెరుందురై సమీపంలో బుధవారం జరిగిన వ్యవసాయ ప్రదర్శనలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలుపరచినట్లు మీడియాకు తప్పుడు సమాచారం ఇచ్చారని మండిపడ్డారు. అదేవిధంగా రైతుల దీర్ఘకాల కోరికైన 'అత్తికడవు' (అవినాశి) పథకం రెండో ఘట్టాన్ని అటకెక్కించిందని ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. డప్పేరి పరిధిలోని ఆర్బీ రోడ్డు, వేల్ మురుగన్ వీధి, వినోభాజీ నగర్, మహేశ్వరి నగర్, తిరుమలై నగర్, సరస్వతి నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

టెన్త్ జవాబుపత్రాల నకళ్ల విడుదల

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి జవాబు పత్రాల నకళ్లు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ నెల 17వ తేది వరకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో SSLC, March/April 2025 Scripts Download అనే లింక్ ద్వారా విద్యార్థులు తమ రిజిస్టర్ నెంబరు, పుట్టిన తేది నమోదుచేసి నకళ్లు పొందవచ్చు. రీ వాల్యుయేషన్, రీ కౌంటింగ్ తదితరాలకు ఈ నెల 16 నుంచి 18వ తేది వరకు జిల్లా ప్రభుత్వ పరీక్షల డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

వైద్య కోర్సులకు 35వేల మంది దరఖాస్తు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు 35వేల మంది దరఖాస్తు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో 9,200 ఎంబీబీఎస్ సీట్లు, 2,150 బీడీఎస్ సీట్లలో విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. www.tnmedicalselection.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమోదు ఈ నెల 6వ తేది ప్రారంభమైంది. ఈ ఏడాది నీట్ ఫలితాలు విడుదల కాకముందే దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. గురువారం సాయంత్రం వరకు 35,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. నీట్ ఫలితాలు శనివారం విడుదల కానున్న నేపథ్యంలో, దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్య విద్య డైరెక్టరేట్ తెలియజేసింది.

రాష్ట్రంలో తొలిసారిగా 10 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా 10 లైన్లతో కూడిన ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 132 కి.మీ పొడవైన ఈ రింగ్ రోడ్డును 2026 జనవరికి అందుబాటులోకి రానుంది. చెన్నై బైపాస్ రోడ్డుగా రూపకల్పన చేసిన ఈ గ్రీన్ ఎక్స్‌ప్రెస్ వే మహాబలిపురం నుంచి కాట్టుపల్లి పోర్టు వరకు 196 అడుగుల వెడల్పులో ఉంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్ వే ఏర్పాటుతో వాహనాలు గంటకు 120 కి.మీ వేగంతో ప్రయాణించేందుకు వీలుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

15,16 తేదీల్లో తంజావూరు జిల్లాలో సీఎం పర్యటన

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 15,16 తేదీల్లో తంజావూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ విషయమై పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ... తంజావూరులో ఈ నెల 15,16 తేదీల్లో తంజావూరు జిల్లా పర్యటన కోసం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 15వ తేది చెన్నై నుంచి విమానం ద్వారా తిరుచ్చికి వచ్చి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కల్లనై చేరుకుంటారని, అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, కల్లనై డ్యాం నుంచి సాగునీరు విడుదల చేయనున్నారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంగా తంజావూరు చేరుకుని, పార్టీ నాయకులతో సమావేశం అవుతారన్నారు. అనంతరం పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్నారని తెలిపారు. 16న ఎమ్మెల్యే చంద్రశేఖరన్ ఇంటి వివాహ వేడుకలో పాల్గొనే సీఎం, పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు.

పెరిగిన పవన విద్యుదుత్పత్తి

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలకు 9,331 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుదుత్పత్తి కేంద్రాలున్నాయి. మే నుంచి సెప్టెంబరు వరకు గాలుల వేగం ఉండడంతో, ప్రతిరోజు సరాసరిన 8 కోట్ల యూనిట పవన విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఆయా సంస్థలు తమ వినియోగానికి పోగా మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ బోర్డుకు విక్రయిస్తుంటాయి. 2024 జూలై 9న 12.01 కోట్ల యూనిట్ల పవన విద్యుదుత్పత్తి జరిగింది. అదే ఇప్పటి వరకు గరిష్ట ఉత్పత్తి. ఈ ఏడాది గత నెల నుంచి సీజన్ ప్రారంభం కావడంతో, గత నెల 29వ తేది 10.39 కోట్ల యూనిట్లు, గురువారం 11.59 కోట్ల యూనిట్లు విద్యుదుత్పత్తి జరిగింది. సెప్టెంబరు వరకు సీజన్ కొనసాగనుండడంతో పవన విద్యుత్ అధికంగా లభించే అవకాశముందని అధికారులు తెలిపారు.

నేడు వాటర్ బోర్డు గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో వాటర్ బోర్డులో ప్రజా సమస్యల పరిష్కార శిబిరం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాటర్ బోర్డు కార్యాలయాల్లో జరుగనుంది. పర్యవేక్షణ ఇంజనీర్ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో, తాగునీరు, మురుగునీటికి సంబంధించిన దీర్ఘకాల సమస్యలు, పన్నులు, రుసుములకు సంబంధించిన సందేహాలను వినతిపత్రం సమర్పించి పరిష్కారం పొందవచ్చు. అలాగే, వర్షపు నీటి సంరక్షణ, నిర్వహణకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేస్తామని వాటర్ బోర్డు అధికారులు తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు రూ.15 కోట్లు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు జీసీసీ రూ.15 కోట్లు కేటాయించింది. నగరంలో జరుగుతున్న మెట్రోరైలు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. అలాగే మెట్రోవాటర్ బోర్డు, విద్యుత్ బోర్డులు కొత్త పైపులు ఏర్పాటు తదితర పనుల కారణంగా రోడ్లు గుంతలమయంగా మారాయి. నైరుతి రుతుపవనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జీసీసీ నిర్ణయించింది. ఆ ప్రకారం, జీసీసీ పరిధిలోని 15 మండలాలకు తలా రూ. కోటి కేటాయించారు. వర్షాలు ప్రారంభానికి ముందే టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.


మేట్టూరు డ్యాం నుంచి సాగునీరు తగ్గింపు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేస్తున్న నీటిని తగ్గించారు. ఈ నెల 12న మేట్టూరు డ్యాం నుంచి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సాగునీటిని విడుదల చేశారు. తొలుత 3 వేల ఘనపుటడుగులు విడుదల చేస్తుండగా, క్రమక్రమంగా 10 వేల ఘనపుటడుగులకు పెంచారు. ఈ క్రమంలో, డెల్టా పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో డ్యామ్ నుంచి విడుదల చేస్తున్న 10 వేల ఘనపుటడుగులను 6 వేల ఘనపుటడుగులకు తగ్గించినట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు.. పట్టించుకోకుంటే పెను విపత్తు ?

● తిరువళ్ళూరు రైల్వేస్టేషన్ సమీపంలో కూలిన వంతెనపైనే ప్రయాణం

టి.నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో కూవం కాలువపై నిర్మించిన వరదరాజనగర్ - మనవాళన్‌నగర్ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. పొంచి ఉన్న ముప్పును పట్టించుకోకుండా ద్విచక్రవాహన చోదకులు ఆ వంతెనపై ప్రయాణిస్తున్నారు. ఈ వంతెన కూల్చివేసి కొత్త వంతెనను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. తిరువళ్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో తిరువళ్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పెరియకుప్పం, వరదరాజనగర్, మనవాళనగర్ ప్రాంతాలకు చేరువగా కూవం వాగుపై అరవైయేళ్ల క్రితం వంతెన నిర్మించారు. ఈ వంతెనను, దానికి సమీపంలోనే ఉన్న రైల్వే గేటును దాటుకునే తిరువళ్లూరు నుంచి శ్రీపెరుంబుదూరు, పూందమల్లి, చెన్నై ప్రాంతాలకు బస్సులు, ఇతర వాహనాలు వెళుతుండేవి. తిరువళ్లూరు స్టేషన్ మీదుగా ఇతర రాష్ట్రాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అధికంగా వెళుతుండటంతో రైల్వే గేటు తరచూ మూసివేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. ఆ ఇబ్బందులను తొలగించేవిధంగా కూవం వాగు, రైల్వేగేటు ప్రాంతాన్ని దాటేలా రాష్ట్ర రహదారుల శాఖ 20 యేళ్లక్రితం ఫ్లైఓవర్ నిర్మించింది. 2006 నుండి ఈ ఫ్లైఓవర్‌పై వాహనాలు, స్థానికులు రాకపోకలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ దిగువన కూవం వాగుపై వరదరాజనగర్ - మనవాళనగర్ వంతెనను వరదరాజనగర్ ప్రాంతానికి చెందిన వేలాదిమంది తిరువళ్లూరు, మనవాళనగర్‌కు వెళ్లేదుందుకు ఉపయోగిస్తున్నారు. 2015లో చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో వరదలు సంభవించినప్పుడు కూవంపై వంతెనలో కొంత భాగం కూరుకుపోయింది. ఈ సంఘటన జరిగి తొమ్మిదేళ్లు దాటిన ఆ వంతెన మరమ్మతుల కోసం ఎవరూ పట్టించుకోలేదు. దీనితో వరదరాజనగర్, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు నిత్యావసర పనుల కోసం తిరువళ్లూరు, మనవాళనగర్‌కు ఈ వంతెనపైనే వెళ్తున్నారు. ఈ పరిస్థితులలో వరదరాజనగర్ - మనవాళనగర్ వంతెన కూల్చివేసి, కొత్తగా నిర్మించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.


రైలు వంతెన పక్కనే కూవంవాగుపై కూరుకుపోయిన వంతెన

ప్రభుత్వ బస్సు, కళాశాల బస్సు ఢీ

14 మంది విద్యార్థినులు సహా 20 మందికి గాయాలు


ఎదురెదురుగా ఢీకొన్న బస్సులు (పక్క చిత్రంలో) క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా నాగావతి సమీపంలో ప్రభుత్వ బస్సు, కళాశాల బస్సు ఢీకొన్న ఘటనలో 14 మంది విద్యార్థినులు సహా 20 మందికి గాయాలయ్యాయి. ధర్మపురి నుంచి నల్లంపల్లి మీదుగా నాగావతి డ్యాం ప్రాంతానికి శుక్రవారం ప్రభుత్వ బస్సు బయల్దేరింది. అదే మార్గంలో చిన్నపంపల్లి నుంచి నల్లంపల్లికి విద్యార్థినులతో బయల్దేరిన ప్రైవేటు కళాశాల బస్సు వెళుతోంది. రోడ్డు మలుపు తిరిగే సమయంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కళాశాల బస్సులోని 14 మంది విద్యార్థినులు, ప్రభుత్వ బస్సు డ్రైవర్, బస్సులోని నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు 108 అంబులెన్స్‌లను రప్పించి గాయపడిన వారిని ధర్మపురి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాంబన్ వంతెన సమీపంలో పడవ బోల్తా

● ఆరుగురు జాలర్లు సురక్షితం


పడవ బోల్తాపడిన దృశ్యం

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాంబన్ వంతెన సమీపంలో పడవ బోల్తాపడిన ఘటనలో ఆరుగురు జాలర్లు సురక్షితంగా బయటపడ్డారు. రాష్ట్రంలో చేపల వేట నిషేధకాలం ముగిసిన నేపథ్యంలో పాంబన్ దక్షిణ ప్రాంతంలోని మండపం ప్రాంతంలో మోటారు పడవకు మరమ్మతులు చేపట్టిన జాలర్లు, శుక్రవారం ఉదయం వారి స్వస్థలమైన మండపానికి తీసుకొస్తున్నారు. పాంబన్ వంతెన తెరచుకోకపోవడంతో, పడవ బరువు, పడవ ఎత్తు తగ్గించడానికి పెద్ద డబ్బాల్లో నీరు నింపారు. ఆ సమయంలో, గాలి వేగం పెరగడంతో, డబ్బాల్లోని నీరు పడవలో పడిపోవడంతో హఠాత్తుగా బోల్తాపడింది. పడవలో ఉన్న ఆరుగురు జాలర్లను సమీపంలోని జాలర్లు రక్షించారు. అలాగే, బోల్తాపడిన పడవను తీరానికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేపట్టారు.

27న వైగో కేసు తుది విచారణ


ఎండీఎంకే నేత వైగో

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశద్రోహం ఫిర్యాదుపై విధించిన ఏడాది జైలుశిక్షను వ్యతిరేకిస్తూ ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన అప్పీలు కేసు తుది విచారణ ఈ నెల 27వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 2009, జూలై 10వ తేదీ 'నాన్ కుట్రం సాట్టుగిరెన్' (నేను నేరారోపణ చేస్తున్నాను) అనే పుస్తకావిష్కరణ సభలో వైగో ప్రసంగించారు. ఆయన భారతదేశంలో నిషేధించిన శ్రీలంక ఎల్టీటీ సంస్థకు మద్దతుగా, భారత ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మాట్లాడారని ఆయనపై థౌజంట్‌లైట్స్ పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు వైగోకు ఏడాది జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ హైకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. శుక్రవారం న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందు ఈ పిటిషన్ విచారణకు రాగా, వైగో తరుపున హాజరైన న్యాయవాది గడువు కోరారు. ఇందుకు అంగీకరించిన న్యాయమూర్తి ఈ కేసు తుది విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● మాజీమంత్రి పొన్ముడి కేసు ...

డీజీపీకి హైకోర్టు నోటీసు


మాజీమంత్రి పొన్ముడి

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శైవ,వైష్ణవ మతాలను మహిళలను కించపరచేలా మాట్లాడిన డీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి పొన్ముడికి వ్యతిరేకంగా సుమోటోగా విచారణకు తీసుకున్న కేసులో డీజీపీ, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ల వివరణ కోరుతూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన పొన్ముడి శైవ,వైష్ణవ మతాల గురించి చలోక్తులు విసరడంతోపాటు మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు మతసామరస్యానికి భంగం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డ మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ పొన్ముడికి వ్యతిరేకంగా సుమోటోగా కేసు దాఖలు చేసి విచారణ చేపట్టాల్సిందిగా హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయమూర్తి వేల్‌మురుగన్ పొన్ముడి ప్రసంగానికి సంబంధించిన వీడియో తదితర ఆధారాలను సేకరించి సమర్పించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, సిటీ పోలీస్ కమిషనర్లకు ఆదేశించి, కేసు తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

తిరుత్తణిలో భారీవర్షం



తిరుత్తణి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన నగరాలు, గ్రామాలు చల్లబడ్డాయి. ఈ నేపథ్యంలో తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. తిరుత్తణిలోని గాంధీ స్ట్రీట్, బైపాస్‌రోడ్డు, ఓల్డ్ బజార్‌స్ట్రీట్, మెట్టువీధి, బస్టాండు వీధి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీనీరు రోడ్లపైకి చేరుకుని రోడ్లన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇదిలా ఉండగా, వేసవి వేడిమిని తట్టుకోలేనివారికి ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది.

● ఆహారం వికటించిన వ్యవహారం...

వృద్ధాశ్రమంలో పెరిగిన మృతుల సంఖ్య

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలోని ఓ వృద్ధాశ్రమంలో ఆహారం వికటించడంతో మరణించిన వారి సంఖ్య నాలుగుకు పెరిగింది. తెన్‌కాశి సుందరపాండ్యన్‌పురంలోవున్న ఓ వృద్ధాశ్రమంలో 60 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. బుధవారం రాత్రి కూడా ఆహారం తీసుకున్న తర్వాత 11 మంది అస్వస్థతకు గురవడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక సెంగోట్టుకు చెందిన శంకర్ గణేష్, అంబిక, చొక్కంపట్టికి చెందిన మురుగమ్మాళ్ మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, చికిత్స పొందుతున్న ధనలక్ష్మి శుక్రవారం ఉదయం మృతిచెందడంతో మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది. తెన్‌కాశి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరోవైపు ఎస్పీ అరవింద్, తాహసీల్దార్ లావణ్య, ఆరోగ్యశాఖ అధికారి గోవిందన్, జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారి పుష్పరాజు తదితర అధికారుల బృందం శుక్రవారం ఆ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ వృద్ధులకు కల్పించినవసతులు తదితరాలను పరిశీలించారు. ఆ తర్వాత ఆశ్రమానికి సీలు వేసి అందులోవున్న 48మందికి వైద్యపరీక్షలు నిర్వహించి సమీపంలోవున్న ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు.

● మాజీమంత్రి కేసీ వీరమణి కేసు...

ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు నోటీసు

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2021వ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో అన్నాడీఎంకే తరుపున పోటీ చేసేందుకు సమర్పించిన నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారం తెలియజేసినట్లు మాజీమంత్రి కేసీ వీరమణిపై దాఖలైన కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్‌కు మద్రాస్ హైకోర్టు నోటీసు జారీ చేసింది. తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరుపున పోటీచేసిన వీరమణి దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో ఆస్తుల వివరాలపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తూ వేలూరుకుచెందిన రామ్మూర్తి అనేవ్యక్తి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.దీని ఆధారంగా తిరుపత్తూరు న్యాయస్థానంలో వీరమణికి వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్ దాఖలు చేసిన కేసు రద్దు చేయాలని కోరుతూ ఆయన తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.దీనిపై విచారణ జరిపిన హైకోర్టు తిరుపత్తూరు న్యాయస్థానం విచారణకు మధ్యంతర స్టే విధించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు మళ్ళీ శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందుకు విచారణకురాగా, ఈసీ తరుపున హాజరైన న్యాయవాది ఈ పిటిషన్‌కు వివరణ ఇచ్చేందుకు గడువు కోరారు. ఈ అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణను జూలై 9వతేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మురుగన్ మహానాడు బహిష్కరించండి

● భక్తులకు సీపీఎం పిలుపు


ప్రచార సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఆధ్యాత్మిక సమావేశం పేరుతో నిర్వహించనున్న రాజకీయ సమావేశాన్ని బహిష్కరించాలని మురుగన్ భక్తులకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తిరువళ్లూర్ జిల్లా తామరైపాక్కంలో ప్రచార సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం మాట్లాడుతూ.. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం దేశంతో పాటు ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలను ఆదుకునేలా, గాయపడిన వైద్య విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో అధికారం చేపట్టాలనే ఆశతో బీజేపీ వివిధ వ్యూహాలు పన్నుతోందని, ఆ కోణంలోనే మదురైలో ఈ నెల 22న మురుగన్ భక్తుల మహానాడు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆధ్యాత్మిక సమావేశం పేరుతో నిర్వహిస్తున్న ఈ రాజకీయ సమావేశాన్ని మురుగన్ భక్తులు బహిష్కరించాలని షణ్ముగం విజ్ఞప్తి చేశారు.

గ్రానైట్ కేసు నుంచి విముక్తి కలిగించండి

సీబీఐ కోర్టులో దురై దయానిధి పిటిషన్



ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు కీల్వలవు ప్రాంతంలోని ప్రభుత్వ గ్రానైట్ క్వారీలో చట్టవిరుద్ధంగా గ్రానైట్ రాళ్లను తవ్వి ప్రభుత్వానికి రూ.259 కోట్ల నష్టం కలిగించినట్లు ఈడీ తనపై నమోదు చేసిన కేసు నుండి విముక్తి కల్పించాలని కోరుతూ సీబీఐ కోర్టులో మాజీ కేంద్రమంత్రి ఎంకే అళగిరి కుమారుడు దురై దయానిధి పిటిషన్ వేశారు. 2012వ సంవత్సరం గ్రానైట్ అక్రమ తవ్వకాలపై కీల్వలవు పోలీసులు దురై దయానిధి, నాగరాజన్‌లపై కేసు నమోదు చేశారు. ఇదిలా వుండగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న దురై దయానిధిపై ఈడీ అధికారులు ప్రైవేటు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపి దురై దయానిధి పేరుతో చెన్నై, మదురై తదితర ప్రాంతాల్లోవున్న 25 భూములు, భవనాలు, బ్యాంకులోవున్న ఫిక్సిడ్ డిపాజిట్ మొత్తం రూ.40.34కోట్ల ఆస్తులను స్తంభింపజేశారు. ఈ కేసు విచారణ శుక్రవారం మదురై జిల్లా సీబీఐ న్యాయస్థానంలో విచారణకు రాగా, ఈడీ కేసు నుండి తనను విడిపించాలని కోరుతూ దయానిధి తరుపున పిటిషన్ దాఖలైంది. అప్పుడు జోక్యం కలుగజేసుకున్న ఈడీ తరుపు న్యాయవాది దురై దయానిధిని విచారణకు హాజరుపరచాలని వాదించారు. ఇరుతరుపు వాదనలు విన్న న్యాయమూర్తి దురై దయానిధి చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

వృద్ధులకు 'ఆరుపడైవీడు' దర్శనం

● జూలై నుంచి దరఖాస్తుల స్వీకరణ

టి.నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ అరవైయేళ్లు దాటిన సీనియర్ సిటిజన్లను తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాలను ఉచితంగా దర్శించేందుకు జూలై నుండి దరఖాస్తులను స్వీకరించనుంది. సీనియర్ సిటిజన్లకు ప్రయాణం, భోజనం, బస సదుపాయాలను ఉచితంగా కల్పించనుంది. సుబ్రహ్మణ్యస్వామివారి దివ్యక్షేత్రాలైన తిరుప్పరంకుండ్రం, తిరుచెందూరు, పళని, స్వామిమలై, తిరుత్తణి, పళముదిర్‌చోలై కి ప్రతియేటా 60 యేళ్లు దాటిన వృద్ధులను బస్సుల్లో తీసుకెళ్లి స్వామి వారి దర్శనం కల్పిస్తోంది. వెయ్యిమందిని ఎంపిక చేసి ఐదు విడతలుగా ఈ అరుపడై వీడుగళ్‌కు దేవాదాయ శాఖ తీసుకెళ్లోంది. ఒక్కో బృందంలో 200 మంది వృద్ధులను బస్సుల్లో ఈ క్షేత్రాలకు తీసుకెళ్ళి వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. ఈ యేడాది అరుపడైవీడుగళ్‌కు తీసుకెళ్ళనున్న వృద్ధుల సంఖ్యను దేవాదాయ శాఖ 2వేలకు పెంచింది. దీనికిగాను రాష్ట్ర ప్రభుత్వం 2.50 కోట్లు కేటాయించింది. తొలివిడత అరుపడైవీడుగ్ దర్శన ప్రయాణం జూలైలో ప్రారంభమవుతుంది. ఆ మేరకు జూలై మొదటి వారంలో హిందూ దేవాదాయ శాఖ వెబ్‌సైట్‌లో ఈ ప్రకటన విడుదలవుతుంది. ఆ వెబ్‌సైట్‌లోనే ఈ ఉచిత యాత్రకు వెళ్ళదలచిన వృద్ధులు దరఖాస్తులు సమర్పించాలని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

వెయ్యి మంది మహిళలకు 'ఈ-ఆటోలు'

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెయ్యి మంది మహిళలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా త్వరలో 'ఈ-ఆటోలు' అందించనున్నారు. సహకార శాఖ ఆధీనంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు, విద్యా రుణాలు, నగల రుణాలు అందజేస్తుంటాయి. అలాగే, స్వయం సహాయక బృందాలకు రుణాలు అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఆర్థికంగా వెనుకబడిన మహిళల జీవనోపాధి పెంచేలా త్వరలో 1,000 'ఈ-ఆటోలు' అందించాలని నిర్ణయించారు. అందుకోసం సహకార సంఘాల ద్వారా తలా రూ.3 లక్షల ఆర్థికసాయం అందించనున్నారు. 25 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపున్నవారు, సిబిల్ స్కోర్ 720కి పైగా ఉండాలి. పొందిన ఆర్థికసాయాన్ని మూడేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంది. ఈ పథకం త్వరలో ప్రారంభించనున్నట్లు, వివరాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, శాఖలను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ దుర్మరణం

అడయార్, జూన్ 13(ఆంధ్రజ్యోతి):కరూర్ జిల్లా పుగలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మోహన్ రాజ్ (52) మృతి చెందారు. ఆయన ఈరోడ్ జిల్లా మలైపాళెయం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం తనఇంటి నుంచి బైకులో విధులకు వెళుతుండగా కుక్క రావడంతో బ్రేక్ వేసారు. వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఆయన హెల్మెట్ ధరించివున్నప్పటికీ తలకు బలమైన గాయం తగలడంతో మృత్యువాత పడ్డారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

మ్యూజియంలో రూ.5.44 లక్షల స్వాహా ముగ్గురికి తలా ఐదేళ్ళ జైలుశిక్ష

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ పాంథియన్‌రోడ్డులోవున్న ప్రభుత్వ మ్యూజియంలో రూ.5.44 లక్షలు కాజేసిన కేసులో ముగ్గురికి తలా ఐదేళ్ళ జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మ్యూజియాన్ని సందర్శించేవారి నుంచి ప్రవేశ రుసుం వసూలు చేసిన జహరుల్లా, జవహర్, జయరాజ్, దేవదాస్ అనే ఉద్యోగులు 2003వ సంవత్సరం నుండి 2007వరకు రూ.5.44 లక్షలు ట్రెజరీలో జమచేయకుండా మోసం చేసినట్లు మ్యూజియం అధికారులు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎగ్మోర్ ఆర్థిక విభాగం పోలీసులు వారిపై ఫోర్జరీ కేసు నమోదు చేశారు. వీరిలో అసిస్టెంట్ డైరెక్టర్ దేవదాస్ అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించాడు. ఈ నేపథ్యంలో, ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తికావడంతో శుక్రవారం దేవదాస్ మినహాయించి మిగిలిన ముగ్గురికి తలా ఐదేళ్ళ జైలుశిక్షతోపాటు రూ.15.5 లక్షల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

తాంబరం నుంచి ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో మరమ్మతుల కారణంగా తేజస్, మన్నై, గురువాయూర్ ఎక్స్‌ప్రెస్ సహా ఐదు రైళ్ల తాంబరం రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరుతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఒకటైన ఎగ్మూర్ రైల్వే స్టేషన్‌లో రూ.734.91 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఎగ్మూర్ నుంచి బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 20 నుంచి ఆగస్టు 18వ తేది వరకు తాంబరం నుంచి బయల్దేరనున్నాయి.

- చెన్నై ఎగ్మూర్-మదురై తేజస్ ఎక్స్‌ప్రెస్ (22671/22672) తాంబరం నుంచి ఉదయం 6.22 గంటలకు బయల్దేరుతుంది. అలాగే, మరుమార్గంలో రాత్రి 9.25 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- ఎగ్మూర్-మన్నార్‌గుడి (16179/16180) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తాంబరం లో రాత్రి 11.22 గంటలకు బయల్దేరుతుంది. తిరిగి తెల్లవారుజామున 5 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- ఎగ్మూర్-తిరుచెందూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20605/20606) తాంబరం నుంచి సాయంత్రం 4.27 గంటలకు బయల్దేరుతుంది. తిరిగి ఉదయం 10 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- ఎగ్మూర్-గురువాయూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (16127/16128) తాంబరం నుంచి ఉదయం 10.47 గంటలకు బయల్దేరుతుంది. మారుమర్గంలో రాత్రి 7.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- ఎగ్మూర్-కొల్లం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (16101/16102) తాంబరం నుంచి సాయంత్రం 5.27 గంటలకు బయల్దేరుతుంది. మరుమార్గంలో వేకువజామున 2.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

చెన్నై బీచ్ నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్...

తాంబరం-హైదరాబాద్ మధ్య నడిపే ఎక్స్‌ప్రెస్ రైళ్లు (12759/12760) ఈ నెల 20 నుంచి ఆగస్టు 18వ తేది వరకు తాంబరంకు బదులుగా చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతాయి.

- మదురై- బికనీర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ (22631) ఈ నెల 26 నుంచి ఆగస్టు 14వ తేది వరకు, మన్నార్‌గుడి- జోధ్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23 నుంచి ఆగస్టు 18వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులుగా చెన్నై బీచ్‌లో ఆగి వెళ్లనున్నాయి.

● టాస్మాక్ అవినీతి కేసు...

సినీనిర్మాత, పారిశ్రామికవేత్త ఇళ్లలో ఏ ప్రాతిపదికన తనిఖీ చేశారు?

ఈడీపై హైకోర్టు ఆగ్రహం

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ అవినీతి వ్యవహారంలో సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్త విక్రమ్ రవీంద్రన్‌లను ఏ ఆధారాలతో విచారించాలని నిర్ణయించారు..? ఈ విషయమై అఫిడవిట్ దాఖలుచేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. టాస్మాక్‌లో రూ.వెయ్యి కోట్ల అవినీతికి సంబంధించి నిర్మాత ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్త విక్రమ్ రవీంద్రన్ ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టి, విక్రమ్ రవీంద్రన్ ఇళ్లు, కార్యాలయాలకు సీలు వేశారు.ఈక్రమంలో, ఈడీ చర్యలను వ్యతిరేకిస్తూ ఆకాష్ భాస్కరన్, విక్రమ్ రవీంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.ఈడీ చర్యలపై స్టే విధించాలని, సీలు తొలగించాలని కోరారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తులు ఎమ్మెస్ రమేష్, వి.లక్ష్మీ నారాయణన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. టాస్మాక్ అవినీతిలో ఆకాష్ భాస్కరన్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఆయన ఒక సినీ నిర్మాత అని, తనిఖీల్లో ఆయన రెండు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారని ఆకాష్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది విజయ్‌నారాయణన్ వివరించారు. విక్రమ్ రవీంద్రన్ టాస్మాక్ ఉద్యోగి కాదని, అతని ఇల్లు,కార్యాలయాన్ని ఎటువంటి సంబంధం లేకుండా సీలు వేశారని విక్రమ్ రవీంద్రన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వి.గిరి తెలిపారు. ఈ వాదనల అనంతరం ధర్మాసనం... ఎలాంటి ఆధారాలతో విక్రమ్ రవీంద్రన్ ఇల్లు, కార్యాలయాలకు సీలు వేశారు? సీలు వేసేందుకు ఈడీకి ఏ అధికారంఉంది? తనిఖీలు చెయ్యొచ్చు, పత్రాలు స్వాధీనం చేసుకోవచ్చు, కానీ ఎలా సీలు వేస్తారంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈడీ చట్టాన్నిపాటించాలని ధర్మాసనం పేర్కొంది. తనిఖీలకు వెళ్లిన సమయంలో ఇల్లు, కార్యాలయానికి తాళాలు వేసి ఉన్నాయని, అందుకే వాటికి సీలు వేశామని ఈడీ తరపు న్యాయవాది ఎన్.రమేష్ తెలిపారు. ఈ విషయమై ఈడీని సంప్రదించాలని నోటీసు అతికించామని, కానీ నెల రోజులు పరారీలో ఉన్న తర్వాత, వారు ఇప్పుడు కోర్టును ఆశ్రయించారని వివరించారు. అందుకు ధర్మాసనం జోక్యం చేసుకుని... తనిఖీ చేపట్టినప్పుడు సంబంధిత వ్యక్తి అక్కడ లేకుంటే, పోలీసుల సహాయంతో తలుపు పగులగొట్టి తనిఖీలు నిర్వహించేవారా? అని ప్రశ్నించారు. అలాగే, ఈ విషయంలో ఏ ప్రాతిపదికన ఇద్దరినీ ప్రశ్నించాలని నిర్ణయించుకున్నారు? సీలు వేసేందుకు ఏ అధికారం ఉంది? ఈ విషయమాలపై ఈడీ అఫిడవిట్ దాఖలుచేయాలని ఆదేశించి, తదుపరి విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదావేశారు.

హొగెనేకల్ జలపాతంలో పెరిగిన ఇన్‌ఫ్లో



టి.నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక - తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతంలో ఇన్‌ఫ్లో విపరీతంగా పెరిగింది. గురువారం ఉదయం ఆ జలపాతంలోకి సెకనుకు 6 వేల ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సెకనుకు 6500 ఘనపుటడుగులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు ఇరిగేషన్ విభాగం అధికారులు తెలిపారు. ప్రధాన జలపాతం, ఐందరువి, సినీ ఫాల్స్, ఐవర్‌పానీ తదితర జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి. పర్యాటకులు జలపాతంలో దోనెలపై సవారీ చేస్తూ అందాలను తిలకిస్తున్నారు. ఇదిలా ఉండగా బిలిగుండ్లు వద్ద కావేరి నదిలో పెరుగుతున్న నీటి ప్రవాహంపై కేంద్ర నీటి వనరుల శాఖ ఉన్నతాధికారులు తీవ్ర నిఘా వేశారు.

కుట్రాలంలో స్నానాలపై నిషేధం

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతాల్లో స్నానాలకు నిషేధం విధించారు. కుట్రాలం జలపాతం పైతట్టు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఐందరువి, మెయిన్ ఫాల్స్, పాత కుట్రాలం ఫాల్స్ తదితరాల జలపాతాల వద్ద నీటి ఉధృతి అధికమైంది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా కుట్రాలం జలపాతాల వద్ద స్నానాలకు నిషేధం విధించిన అటవీ శాఖ అధికారులు, పర్యాటకులు జలపాతాల వద్ద వెళ్లకుండా భద్రతా విధులు నిర్వహిస్తున్నారు.

రూ.151 కోట్లతో మందవెల్లి వద్ద బస్ టెర్మినల్



బస్ టెర్మినల్ ఊహాచిత్రం

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మందవెల్లి బస్టాండు త్వరలో బస్ టెర్మినల్‌గా కొత్త రూపు సంతరించుకోనుంది. ఆ ప్రాంతంలో రూ.151 కోట్లతో బస్ టెర్మినల్ నిర్మించనున్నారు. ఈ కొత్త బస్‌టెర్మినల్‌ను చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్), రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ (టిడ్కో) సంయుక్త భాగస్వామ్య సంస్థగా ఉన్న చెన్నై మెట్రో అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (సీఎంఏఎంఎల్) నిర్మించనుంది. ఏడంతస్థులతో నిర్మించనున్న ఈ బస్‌టెర్మినల్ వద్ద 184 ద్విచక్రవాహనాలు, 96 నాలుగు చక్రాల వాహనాలకు పార్కింగ్ కేటాయిస్తారు. దిగువ దళం నుండి ఏడో అంతస్థు వరకు కార్యాలయాలు, రిసెప్షన్ లాంజ్‌లు, చిల్లర దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఉంటాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ బస్ టెర్మినల్‌ను నిర్మించనున్నామని చెన్నై మెట్రోరైల్ సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. మందవెల్లి బస్‌టెర్మినల్ రెండోదశ మెట్రోరైల్వే స్టేషన్‌కు చేరువగా ఉండటంతో నగరవాసులు అటు రైలు ప్రయాణం, ఇటు సిటీ బస్సు ప్రయాణం సులువుగా చేయగలుగుతారని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న నిషేధ కాలం

● చేపల వేటకు సిద్ధమవుతున్న జాలర్లు



పడవల్లోకి ఐస్ నింపుతున్న జాలర్లు

పెరంబూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నిషేధ కాలం ముగియనుండటంతో శనివారం అర్ధరాత్రి 12 నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లేందుకు మత్స్యశాఖ జాలర్లకు అనుమతిచ్చింది. ఏప్రిల్, మే, జూన్ తదితర మూడు నెలలు సముద్ర జీవుల సంతానోత్పత్తి కోసం చేపల వేటపై నిషేధం విధిస్తుంటారు. 2001 నుంచి ఈ నిషేధ కాలం అమలువచ్చింది. ఆ ప్రకారం, రాష్ట్రంలో తిరువళ్లూరు, కాంచీపురం, కడలూరు, కారైక్కాల్ సహా 16 కోస్తా జిల్లాల్లో ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుండి జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజులు జాలర్లు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లేందుకు అనుమతించలేదు. ప్రారంభంలో 45 రోజులున్న నిషేధ కాలం క్రమక్రమంగా 61 రోజులకు పెంచారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో ఏప్రిల్ 14వ తేది అర్ధరాత్రి నుంచి తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు నుంచి కన్నియాకుమారి జిల్లా నీరోడి గ్రామం వరకు 1,076 మైళ్ల విస్తీర్ణంలో ఉన్న తూర్పు తీర ప్రాంతంలో ఈ ఉత్తర్వులు అమలుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో, నిషేధకాలం ముగిసి శనివారం అర్ధరాత్రి 12 నుంచి మోటారు పడవల జాలర్లు చేపల వేటకు వెళ్లనున్నారు. అలా వెళ్లే జాలర్లు 3 నుంచి 7 రోజుల తర్వాత తీరానికి తిరిగి వస్తుంటారు. వేట కాలానికి సరిపడేలా ఆహారం, నీరు, సరిపడా డీజిల్ సిద్ధం చేసుకున్నారు. అలాగే, పట్టిన చేపల భద్రపరిచేందుకు ఐస్ కూడా తీసుకెళ్లనున్నారు. చేపల వేటకు వెళ్లిన జాలర్లు అధిక చేపలతో తిరిగి రానున్న నేపథ్యంలో, చేపల ధరలు కూడా తగ్గే అవకాశముంది.

సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటే మా ఆశయం : తిరుమా



మీడియాతో మాట్లాడుతున్న తొల్ తిరుమావళవన్

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కావాలని, మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలని తమ పార్టీ ఎన్నో యేళ్లుగా డిమాండ్ చేస్తున్నదని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ పేర్కొన్నారు. తిరుచ్చిలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో కొన్ని పార్టీలన్నీ కలిసి కట్టుగా పోటీ చేసి కూటమిని గెలిపిస్తున్నాయని, అలాంటప్పుడు ఆ కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షాలకు భాగస్వామ్యం కల్పించాలని కోరటం తప్పుకాదన్నారు. రాబోవు శాసనసభ ఎన్నికల్లో డీఎంకే అధిష్ఠానానికి గతం కంటే ఎక్కువ సీట్లు కోరతామని ఆయన చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి ఇంకా బలపడలేదని, మిత్రపక్షాలన్నీ ఏ వైపు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం విధించాలని తమ పార్టీ ప్రధాన ఆశయమని, వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల్లోగా డీఎంకే ప్రభుత్వం ఈ విషయంపై నిర్ణయం తీసుకుని ప్రకటించాలని ఆయన కోరారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి మంచిపేరు తెచ్చుకుంటున్న డీఎంకే ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేకే బీజేపీ రాష మాజీ అధ్యక్షుడు అన్నామలై పసలేని ఆరోపణలు చేస్తున్నారని, అవినీతి అక్రమాలు పెరిగాయని విమర్శలు చేస్తున్నారే తప్ప, వాటికి సంబంధించిన ఆధారాలను విడుదల చేయడం లేదన్నారు. అహ్మదాబాద్ దుర్ఘటన చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలను ఎలా ఓదార్చాలో తెలియటం లేదని, నష్టపరిహారం మరింత పెంచాలని తిరుమావళవన్ డిమాండ్ చేశారు.

4న మిర్చి శివ 'పరందు పో' విడుదల

చిత్రజ్యోతి

మిర్చి శివ హీరోగా నటించిన 'పరందు పో' జూలై 4వ తేదీ విడుదల కానుంది. మిర్చి శివ, గ్రేస్ ఆంటోనీ, మాస్టర్ మిథున్, అంజలి, అంజూ వర్గీస్, విజయ్ యేసుదాస్ తదితరులు నటించారు. సినిమా విడుదలను పురస్కరించుకుని ఆడియో, ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు మారి సెల్వరాజ్, మిష్కిన్, మీరా కదిరవన్, రంజిత్ జయకొడి, నిర్మాత సురేష్ కామాక్షి, నటి వేణి తదతరులు హాజరై ఆడియో రిలీజ్ చేశారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరిలాగే నాలో కూడా కొన్ని లోపాలున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా సరిచేసుకుంటున్నాను. శివ, గ్రేసీ వంటి ప్రతిభావంతులైన నటీనటులతో కలిసి పని చేయడం చాలా సంతోషంగా ఉంది. రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్ ఈ సినిమాను చూసి ప్రశంసించారు. హీరో మిర్చి శివ మాట్లాడుతూ, 'దర్శకుడు రామ్‌తో సినిమా అనగానే కాస్త భయం వేసింది. లోకేషన్‌లో ఆయన ఒక డైరెక్టరుగాకాకుండా, అన్ని పనులు ఆయనే చూసుకున్నారు. ఆయనకు మరిన్ని సక్సెస్‌లు రావాల్సి ఉంది. హీరోయిన్ గ్రేస్ ఆంటోనీ మాట్లాడుతూ, 'నా పాత్ర భిన్నంగా ఉంది. హీరో శివతో కలిసి కామెడీ చేయడం కొత్తగా ఉంది. అతిథుల్లో ఒకరైన దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'కామెడీ చిత్రాలంటే నాకు అమితమైన ఇష్టం. మా జీవితాలను మార్చేసింది తమిళ ఈలం సమస్య. అప్పటి నుంచే సినిమాల గురించి అధికంగా మాట్లాడుతున్నాను. లేకపోతే 'కలవాణి' వంటి కమర్షియల్ గ్రామీణ చిత్రాలను తెరకెక్కించేవాడిని. బాల్యంలో నేను గడపని జీవితాన్ని ఈ చిత్రంలో ఉంది. తెరపై చూపించే పాత్రల్లో అబద్ధం ఉండకూడదని భావించే వ్యక్తి దర్శకుడు రామ్. 'వాళై' సినిమాను విజయవంతం చేసినట్టుగానే ఈ మూవీని కూడా హిట్ చేయాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం సంతోష్ దయానిధి.



ఆడియో రిలీజ్ దృశ్యం

కెప్టెన్ విజయ పరంపర కొనసాగించేనా?

● నేడు 'పడై తలైవన్' రిలీజ్



'పడై తలైవన్'లో షణ్ముగ పాండియన్

సీనియర్ నటుడు దివంగత 'కెప్టెన్' విజయకాంత్ వారసుడిగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన యువ నటుడు షణ్ముగ పాడియన్ తాజాగా నటించిన చిత్రం 'పడై తలైవన్'. యు.అన్బు దర్శకుడు. శుక్రవారం విడుదలవుతుంది. తన తండ్రి సినీ విజయ వారసత్వాన్ని కొనసాగించేందుకు పదేళ్లుగా శ్రమిస్తున్నారు. వాస్తవానికి 2015లోనే 'సగాబ్దం' అనే చిత్రం ద్వారా హీరోగా పరిచయమయ్యారు. కానీ, ఆ మూవీ ఆశించిన స్థాయిలో ప్రజాదారణ పొందలేదు. మూడేళ్ళ విరామంతో 'మదురై వీరన్' అనే చిత్రంలో నటించినా అది కూడా నిరాశపరిచింది. ఇపుడు మూడో చిత్రంగా 'పడై తలైవన్'లో నటించగా, శుక్రవారం విడుదలవుతోంది. ఇందులో పూర్తి యాక్షన్ హీరోగా నటించారు. నిజానికి విజయకాంత్ ఫ్యాన్స్ థియేటర్లకు వచ్చి చూస్తేనే ఈ చిత్రం ఘన విజయం సాధిస్తుంది. ఆ ఆశతోనే భారీ బడ్జెట్‌తో, భారీ యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో తన తండ్రి సినిమాల తరహాలోనే ఈ మూవీని డిజైన్ చేశారు. వీజే కంబైన్స్ పతాకంపై జగన్నాథన్ పరమశివన్ నిర్మించగా, ఇళయరాజా సంగీతం. షణ్ముగ పాండియన్‌తో సహా కస్తూరి రాజా, యామిని చందర్, మునీష్‌కాంత్, గరుడ రామ్, రిషి రిత్విక్, శ్రీజిత్ రవి తదితరులు నటించారు.

'బెంజ్' చిత్రంలో మడోన్నా సెబాస్టియన్



భాగ్యరాజ్ కన్నన్ దర్శకత్వంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించే 'బెంజ్' చిత్రంలో మడోన్నా సెబాస్టియన్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు సమాచారం. లోకేష్ సినిమాటిక్ యూనివర్సల్ (ఎన్‌సీయూ)లో భాగంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇందులో రాఘవ లారెన్స్, నవీన్ పోలి, సంయుక్తా మేనన్ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. లోకేష్ కనకరాజ్ సొంత నిర్మాణ సంస్థ 'జి స్క్వాడ్', నిర్మాత జగదీష్ పళనిస్వామి 'ది రూట్' బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌ను దేశంలోని పలు ప్రాంతాలతో పాటు విదేశాల్లో కూడా చిత్రీకరించారు. ఎల్‌సీయూ భాగంగా రూపొందిన 'లియో'లో నటించిన మడోన్నా సెబాస్టియన్ నటించగా, ఇపుడు 'బెంజ్'లో అవకాశం ఇచ్చారు.



'జన నాయగన్'లో విజయ్

విజయ్ బర్త్‌డే స్పెషల్‌గా 'జన నాయగన్' టీజర్

అగ్రహీరో విజయ్ ఈ నెల 22వ తేదీ తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకోనున్నారు. ఆ రోజున ఆయన అభిమానులకు కానుకగా తాను నటిస్తున్న కొత్త చిత్రం 'జన నాయగన్' టీజర్ రిలీజ్ చేసి గిఫ్టుగా ఇవ్వాలని మేకర్స్ నిర్ణయించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై హెచ్.వినోద్ దర్శకత్వంలో ఈ చిత్ర రూపుదిద్దుకుంటోంది. విజయ్, బాబీ డియోల్, పూజా హెగ్డే, గౌతం మేనన్, ప్రియమణి, మమిత బైజు తదితరులు నటిస్తున్నారు. ఈ మూవీ ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్, శాటిలైట్ రైట్స్‌ను సన్ టీవీ సంస్థలు భారీ ధరకు సొంతం చేసుకున్నాయి.



మృదుల ఓరుగంటి

పిల్లలను పెంచిపోషించడం కూడా ఒక కళే. క్రమశిక్షణతో, ప్రేమానురాగాలతో పెంచి, విద్యాబుద్ధులు నేర్పినప్పుడే ఆ పిల్లలు భావిభారత పౌరులుగా రాణించగలుగుతారు. సంసారసాగరంలో సమస్యల ప్రభావం పిల్లలపై పడకుండా పెంచడం అంటే మాటలు కాదు. ఉద్యోగినులకు తల్లులైన తర్వాత చిన్నారుల పెంపకం అనేది ఒక సవాల్‌గా మారింది. అందుకే తల్లులందరి కోసం పిల్లల పెంపకాన్ని కూడా అహ్లాదకరంగా నిర్వహించేందుకు నైపుణ్యం, అవగాహన అనేవి తల్లుల్లో కలిగించేందుకు నగరానికి చెందిన ఇంజనీరింగ్ పట్టభద్రురాలు మృదుల ఓరుగంటి 'పేరెంటింగ్ హబ్' అనే వాట్సాప్ కమ్యూనిటీకి నాంది పలికారు. అంతేకాకుండా తన మోటివేషన్ ప్రసంగాలతో పిల్లలకు మార్గదర్శకురాలవుతున్నారు. ఆ విశేషాల సమాహారమే నేటి మన 'తరుణి'లో....

తరుణి

వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి



తల్లులకు స్ఫూర్తిదాయకం...

పిల్లలకు మార్గదర్శకం

● 'పేరెంటింగ్ హబ్' సృష్టికర్త మృదుల

మృదుల జన్మించింది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపురం. తండ్రి ఓరుగంటి మల్లిక్, ఆయన ఓ జర్నలిస్ట్. తల్లి సావిత్రీదేవి గృహిణి. మల్లిక్ నిర్వహించే యూట్యూబ్ ఛానల్స్ 'యజ్ఞోపవీతం', 'సాయిసన్నిధి'లకు మృదుల తల్లి గాత్రదానం చేస్తోంది. మృదులకు ఇద్దరు సోదరీమణులు. మృదుల విద్యాభ్యాసం అంతా ఎంటెక్ వరకు మార్కాపురంలోనే జరిగింది.

కుటుంబం.....: మృదుల భర్త కాజా విక్రమ్. ఆయన ఇంజనీర్. ఈ దంపతులకు ఒక కుమారుడు.

ఉద్యోగ జీవితం... : మృదుల మార్కాపురంలో రెండేళ్లపాటు పవర్ గ్లోబల్ కాలేజీలో ఉద్యోగం చేశారు. వివాహానంతరం చెన్నైలో స్థిరపడిన ఆమె ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో ఆరేళ్లు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆపైన హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నాలుగేళ్లు పనిచేసి, రెండేళ్ళుగా 'జిగామన్' కంపెనీ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొనసాగుతున్నారు.

పేరెంటింగ్ హబ్ ప్రారంభం...

పేరెంటింగ్ హబ్ వాట్సాప్ కమ్యూనిటీ పెట్టాలనే ఆలోచన , ఉద్యోగిగా, తల్లిగా తన అనుభవం, ఒత్తిడి, పిల్లలకు సరైన న్యాయం చేయలేకపోతున్నానన్న అపరాధ భావన వల్ల కలిగిందని చెప్పారు. ఈ విషయమై మృదుల 'తరుణి'తో మాట్లాడుతూ... 'వివాహానంతరం భర్తతో చెన్నైలో స్థిరపడ్డాను. ఎస్‌ఆర్‌ఎమ్ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సమయంలో బాబు జన్మించాడు. గృహిణిగా, తల్లిగా, ఉద్యోగినిగా అన్ని బాధ్యతలను సమన్వయం చేసుకోవడంలో విపరీతమైన ఒత్తిడికి లోనయ్యేదాన్ని. అన్ని స్వయంగా నేనే చేసుకోవాలన్న తపనలో, బాబుపై శ్రద్ధ చూపలేకపోయేదాన్ని. ఒకానొక సమయంలో ఉద్యోగం మానేయాలనుకున్నాను.. భర్త సలహాతో ఉద్యోగం వదిలి సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరాను. అందులో కొంచెం వెసులుబాటు వచ్చినా.. సమస్య అలాగే ఉండిపోయింది. బాబుని దండించకుండా ప్రేమగా ఎలా పెంచాలి, మనకున్న సమయంలో సమర్థవంతంగా పిల్లలకి నైపుణ్యాలను ఎలా నేర్పించాలి, వృత్తి, ఇంటి బాధ్యతలను ఎలా సమన్వయంగా చూసుకోవాలి తదితర అంశాల్లో స్పష్టతరాలేదు. అప్పుడే నిపుణుల సలహాలు తీసుకున్నాను. పిల్లల పెంపకం గురించి పలు పుస్తకాలు చదివాను. వాటి వల్ల స్పష్టమైన అవగాహన ఏర్పడింది. అత్తగారి సాయం తీసుకున్నాను. బాబుతో కఠినంగా వ్యవహరించకుండా మృదువుగా, ఎన్నో విషయాలను నేర్పించి, బాబుతో పాటు నేను కూడా ఎదిగాను. నేనిప్పుడు వృత్తిపరంగా, ప్రవృత్తిపరంగా, తల్లిగాను చాలా సంతృప్తిని అనుభవిస్తున్నాను. నాలాగే ఎందరో తల్లులు పిల్లల పెంపకం విషయంలో ఇబ్బంది పడుతుంటారు. అలాంటివారికి సహాయం చేయాలనే లక్ష్యంతో ఈ 'పేరెంటింగ్ హబ్'కి శ్రీకారం చుట్టాను' అని వివరించారు. మృదుల ప్రారంభించిన ఈ కమ్యూనిటీలో 300 పైగా సభ్యులున్నారు. వారానికి ఒకసారి 'జూమ్' మీటింగ్స్‌లో కలుసుకొని వారి సమస్యలను చర్చించి, పరిష్కార మార్గాలను ఎంచుకొని పిల్లలతో హాయిగా గడపగలుగుతున్నారు.

ఇతర కార్యకలాపాలు...

ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూనే చెన్నైలోని సత్యభామ వర్సిటీ, రాజ్యలక్ష్మీ ఇంజనీరింగ్ కాలేజీ, ఎస్‌ఆర్‌ఎం వంటి కాలేజీలకు గెస్ట్ లెక్చరర్‌గా వెళ్ళి విద్యార్థులకు ఉపయుక్తమైన విషయాలపై ప్రసంగిస్తుంటారు. ఎన్నో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలకు ముఖ్యఅతిథిగా వెళ్ళి విద్యార్థుల జీవితాలకు సంబంధించి పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తుంటారు. చిన్నారుల కోసం సమ్మర్ క్యాంప్స్ కూడా నిర్వహిస్తుంటారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నిపుణుల ద్వారా ఆన్‌లైన్‌లో చిన్నారులకు వేసవి తరగతులు నిర్వహిస్తుంటారు.

ఐటీ రంగంలో కూడా తరచూ వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన, ఉద్యోగ నిర్వహణలో ఒత్తిడికి లోనుకాకుండా పనులు చేసేలా పలు ప్రసంగాలిస్తుంటారు మృదుల. వృత్తికి సంబంధించిన నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొనే విధానాల గురించి కూడా తన ప్రసంగాల ద్వారా ఉద్యోగులకు సహకరిస్తారు. వివిధ వేదికలపై మహిళల కోసం ఎన్నో ప్రసంగాలను ఇవ్వడమే కాకుండా అయా అంశాల్లో నిపుణులచే ప్రసంగాలిప్పించి, మహిళలకు చేయూతగా నిలుస్తున్నారు.తండ్రి నిర్వహించే యూ ట్యూబ్ ఛానళ్లకు సాంకేతిక సహకారాన్ని అందించి కుమార్తెగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు.



కుటుంబ సభ్యులతో

అవార్డులు... : ఇష్టమైన ప్రవృత్తికి సమయాన్ని కేటాయించడమే కాకుండా, దాన్ని నిబద్ధతతో నిర్వహిస్తూ, ఎన్నో అవార్డులను సొంతంచేసుకున్నారు మృదుల. 2019లో జీహెచ్‌సీఐ వారిచే 'ఎమినెంట్ స్పీకర్' పురస్కారాన్ని అందుకున్నారు. 2023-2024వ సంవత్సరంలో జిగామన్ వారిచే రెండుసార్లు 'ఇన్నోవేషన్ ఫెయిర్ విన్నర్' అవార్డులు అందుకున్నారు. 2019లో హెచ్‌సీఎల్ నిర్వహించిన పోటీలో 'హాస్‌థన్' అవార్డు పొందారు. తాను పనిచేస్తున్న సంస్థలో నిబద్ధత కలిగిన అత్యుత్తమ ఉద్యోగినిగా ప్రశంసలందుకున్నారు.

'అన్ని మనమే చేయాలన్న భావన వదిలి కుటుంబ సభ్యుల సహకారం తీసుకుంటే పిల్లలతో అనుబంధం దృఢమవుతుంది. మన మార్గనిర్దేశంలో పిల్లలు నేర్చుకోలేని విషయాలు అంటూ ఏవీ ఉండవు. మనం నిబద్ధతను పాటిస్తూ పిల్లలకు ఉదాహరణగా నిలిస్తే ఆ చిన్నారి చేతులు కూడా ఆనందంతో పనిచేస్తాయి. చిన్నారుల మోమున చిరునగవులు విరబూస్తాయి.' అని మృదుల 'తరుణి'తో తన మనోగతాన్ని పంచుకున్నారు మృదుల.

మదురై మహానాడులో 'ఆరుపడై వీడుగళ్' ఆగమ విధులకు విరుద్ధం

● అర్చకుల సంఘం పిటిషన్

టి.నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మదురైలో బీజేపీ, హిందూ మున్నని, వీహెచ్‌పీ సంయుక్తంగా నిర్వహించనున్న మురుగ భక్తుల మహానాడు ప్రాంతం వద్ద నమూనా ఆరుపడైవీడుగళ్ సెట్టింగ్ నిర్మించడం ఆగమ శాస్త్రానికి విరుద్ధమంటూ అర్చక శిక్షణ పొందిన విద్యార్థుల సంఘం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. మదురై అమ్మా దిడల్‌లో ఈ నెల 22న మురుగ భక్తుల మహానాడు జరుగనుది. ఆ మహానాడు ప్రాంగణం వద్ద మురుగప్పెరుమాన్ ఆరుదివ్యక్షేత్రాలను తలపించేలా నామూనా ఆలయాలను నిర్మిస్తున్నారు. అరుపడై వీడుగళ్ సెట్టింగ్‌లకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఇదివరకే హిందూమున్నని నిర్వాహకులు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ సందర్భంగా అరుపడైవీడుగళ్ సెట్టింగ్‌లను నిర్మించవచ్చునని, అయితే పూజలు చేయకూడదని హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులిచ్చి, కేసు తదుపరి విచారణను ఈ నెల 13కు (శుక్రవారానికి) వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో మదురై మహనాడు ప్రాంతం వద్ద ఆరుపడై వీడుగళ్ సెట్టింగ్‌లకు అనుమతించకూడదంటూ అర్చక శిక్షణ పొందిన విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వి.అరంగనాథన్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అరుపడై వీడుగళ్‌లో ఆగమవిధుల ప్రకారమే పూజాది కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని, మురుగప్పెరుమాన్ ఆరుపడై వీడుగళ్‌లో ట్రస్టుబోర్డు అనుమతి పొంది, బాలాలయం నిర్వహించి, మూలవర్లకు విశేష పూజలు చేసిన ఉత్సవమూర్తిని మాత్రమే వెలుపలకు తీసుకురావటానికి వీలుందన్నారు. హిందూ మున్నని నిర్మించే అరుపడై వీడుగళ్‌లో మూల విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి వీలులేదని, ఉత్సవమూర్తిని కూడా ఆగమ శాస్త్రం ప్రకారమే ప్రతిష్ఠించి, కుంభాభిషేకం జరిపిన మీదటే ఆ ఉత్సవమూర్తికి పూజలు చేయాల్సి ఉంటుందన్నారు. హిందూ మున్నని నాయకులు చెబుతున్నట్లు ఈ నమూనా అరుపడై వీడుగళ్‌లో రెండు వేళల్లో పూజలు జరుపుతామని ప్రకటించడం ఆగమ శాస్త్రానికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఈ నమూనా అరుపడై వీడుగళ్ నిర్మించేందుకు దేవాదాయ శాఖ, మదురై నగర కార్పొరేషన్, అగ్నిమాపక శాఖ, కాలుష్య నియంత్రణా మండలి అనుమతులు కూడా పొందలేదని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఆధ్యాత్మిక భావాలను, విశ్వాసాలను రాజకీయాలకు ఉపయోగించుకోకూడదని, భగవంతుడిని పార్టీ చిహ్నంగా మార్చే ప్రయత్నాలు చేయకూడదని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని మురుగభక్తుల మహానాడు వద్ద ఈ నమూనా ఆరుపడై వీడుగల్ సెట్టింగ్‌లను నిర్మించడంపై స్టే విధించి, హిందూ మున్నాని తరఫు పిటిషన్‌ను తోసిపుచ్చాలని పిటిషనర్ కోరారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) ఓ ప్రకటనలో తెలిపింది.

అంబత్తూరు సిడ్కో...

మేనామేడురోడ్డు, ఈబీరోడ్డు, యాదవల్‌వీధి, నార్త్ సెక్టార్ -3, పడవేటి అమ్మన్‌నగర్, పిల్లయార్‌కోవెలవీధి, కుచ్చినకుప్పం, అంబేడ్కర్‌నగర్, ఎంజీఆర్‌వీధి, న్యూడైనీషెడ్, టాస్‌ఎస్టేట్ 7 నుండి 10వీధులు, సిడ్కో ఎస్టేట్ 8వ వీధి, 1 నుండి 3 ప్రధానవీధులు, కార్మికుల కోర్టర్స్ 12వ వీధి, 5 నుండి 11 ఈస్ట్ క్రాస్‌వీధులు, ఎస్పీ 17 నుండి 28వరకు విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని టీఎన్ఈబీ ఓ ప్రకటనలో తెలిపింది.

'టామరిండ్ టేల్స్' రెస్టారెంట్ ప్రారంభం

అడయార్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోని అత్యుత్తమ రుచులతో వంటలు తయారు చేసే 'టామరిండ్ టేల్స్' అనే రెస్టారెంట్‌ను సినీ సెలబ్రిటీలు సోనాక్షి, కిరణ్ తాజాగా ప్రారంభించారు. తేనాంపేట, ఆస్టిన్ నగర్ సెనెటాఫ్ రోడ్డులో ప్రారంభించిన ఈ రెస్టారెంట్‌లో మార్నింగ్ స్నాక్స్, రుచికరమైన డిన్నర్‌తో పాటు ప్రాంతీయ వంటకాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేరొందిన వంటకాలు, కేరళ పుట్టు, కడల కర్రీ, కర్ణాటక బెన్నే దోశ, కొరి దోశ ఇలా మంచి పేరొందిన వెజిటేరియన్ వంటకాలు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటితోపాటు సౌత్ ఇండియన్ ఫిల్టర్ కాఫీ, వివిధ రకాల్లో ఫలోడా, పండ్ల రసాలు కూడా అందుబాటులో ఉన్నాయని రెస్టారెంట్ నిర్వాహకులు పేర్కొన్నారు.



రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో సోనాక్షి, కిరణ్


శిలాతోరణం సర్కిల్ వరకు క్యూ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగు రోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.11 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,609

తలనీలాలు సమర్పించినవారు: 33,144



శ్రీవారిసేవలో ప్రముఖులు



ఆలయం ముందు రాజ్యసభ కమిటీ

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రభుత్వ హామీల రాజ్యసభ కమిటీ ఛైర్మన్ తంబిదొరై, సభ్యులు, ఎంపీ పార్థసారధి, రాజస్థాన్ మంత్రులు జవహర్ సింగ్ బేఢం, కృష్ణకుమార్ వైష్ణోయ్, సెల్కాన్ ఎండీ గురుస్వామిని నాయుడు ఉన్నారు. దర్శనం అనంతరం రాజస్థాన్ మంత్రులు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

భూదేవి కాంప్లెక్స్ వద్ద క్యూలైన్లు, షెడ్లు

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్ లోస్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు వసతులు ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం 430 మీటర్లు నిర్మిస్తున్న క్యూలైన్‌ను మరో 150 మీటర్ల మేరకు పెంచనున్నారు. ఎండ, వానలకు ఇబ్బంది లేకుండా 2,400 మంది వేచిఉండేలా రెండు శాశ్విత షెడ్లను నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందు వల్ల క్యూలైన్లతో కలిపి 5600 మందికి సౌకర్యం కలుగు తుంది. అలాగే భూదేవి కాంప్లెక్స్ పైఅంతస్తును కూడా టోకెన్ల కోసం వచ్చే భక్తులకు వినియోగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. శ్రీనివాసం లోనూ శాశ్విత క్యూలైన్ల నిర్మాణం కోసం టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇంజినీరింగ్ అధికారుల బృందం టోకెన్ల జారీ కేంద్రాలను పలుమార్లు పరిశీలించాక ఈ ప్రతిపాదన సిద్ధం చేశారు.



భూదేవి కాంప్లెక్స్ వద్ద స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల కోసం వేచిఉన్న భక్తులు

తిరుమల, ఆంధ్రజ్యోతి

హిందువులకు ఆరాధ్యదైవం కొలువుండే తిరుమలను కూడా ఐదేళ్లు భ్రష్టు పట్టించారు. భక్తి క్షేత్రాన్ని రాజకీయ ప్రయోజనాలకు అడ్డంగా వాడేశారు. గుంపులతో దర్శనాలకు వచ్చి సామాన్య భక్తులకు క్యూలైన్లలో చుక్కలు చూపించారు. దర్శనాలు.. కాటేజీలు.. అన్నింటా బ్లాకువీరులు పెరిగిపోయారు. బోర్డు సభ్యులే దుకాణాలు తెరిచారనే విమర్శలు ఎదుర్కొన్నారు. రాజకీయ ప్రసంగాలకు ఆలయ పరిసరాలను వేదికగా మలచుకున్నారు. చివరికి భక్తులకు ఇష్టమైన లడ్డూనే కల్తీ నెయ్యితో చేసి మచ్చ తెచ్చారు. ఆర్గానిక్ పేరుతో అన్నప్రసాదాలను రుచి కోల్పోయేలా చేశారు. తిరుపతి అభివృద్ధి అంటూ నమ్మబలికి కమీషన్ల కోసం వందల కోట్ల టీటీడీ నిధులను అనవసర నిర్మాణాలకు మళ్లించారు. ఐదుళ్లూ, ప్రజలలాగే మౌనంగా ఉన్న స్వామి.. ఆ తర్వాత లెక్క తేల్చేశారు. తనకే ఎగనామం పెట్టిన దొంగభక్తులను రెండు నామాల సంఖ్యకే పరిమితం చేశారు. 2024 జూన్ 12న అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఈ పెనుసవాళ్లను స్వీకరించింది. తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. భక్తులకూ భగవంతుడికీ నడుమ దూరం తగ్గించింది. ఏడాది కాలంలో తిరుమలలో జరిగిన మార్పుల సమాహారం ఇది...



భక్తులకూ భగవంతుడికీ నడుమ
తగ్గిన దూరం



■ కీలక నిర్ణయాలు..

కూటమి ప్రభుత్వంలో గతేడాది నవంబరు 6న బీఆర్ నాయుడు సారధ్యంలో టీటీడీ కొత్త ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక అనేక మార్పులు జరిగాయి.

- తిరుమల కొండపై రాజకీయ ప్రసంగాలకు బ్రేక్ పడింది. ఉల్లంఘిస్తే కేసులు పెట్టేలా తీర్మానం చేశారు.
- జగన్ జమానాలో నిబంధనలతో నిమిత్తం లేకుండా యదేచ్ఛగా నిర్మాణాలు సాగించిన శారద మఠం లీజును రద్దు చేశారు.
- అన్యమత ఉద్యోగులను తిరుమల నుంచి పంపేలా నిర్ణయం తీసుకున్నారు.
- గత ప్రభుత్వంలో టూరిజం కోటా పేరుతో దర్శనాల వ్యాపారం సాగుతోందని గుర్తించి, దానిని రద్దు చేశారు.
- తిరుపతి, తిరుమల స్థానికులకు దర్శనం విధానాన్ని తిరిగి అమలుచేస్తున్నారు.
- టీటీడీ సేవలపై భక్తుల అభిప్రాయ సేకరణ కోసం 'ఫీడ్‌బ్యాక్ సిస్టమ్'ను తీసుకువచ్చారు.
- తిరుమలలోని అతిథిగృహాలకు దాతల సొంత పేర్లను తొలగించి, ఆధ్యాత్మిక, దేవుళ్ల పేర్లు మాత్రమే ఉండేలా నిర్ణయం తీసుకున్నారు.
- ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ శ్రీవారి ఆలయం నిర్మించాలని తీర్మానించారు.
- అలిపిరిలో ప్రయివేటు నిర్మాణాలు ఉండరాదంటూ ఆ భూములకు ప్రత్యామ్నాయ స్థలాను కేటాయించేలా టీటీడీ నిర్ణయం తీసుకుంది.

లడ్డూకి రుచి వచ్చిందోచ్!



తిరుమల లడ్డూకి పూర్వపు రుచీ, శుచీ మళ్లీ వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు తిరుమల లడ్డూ మీద దృష్టి పెట్టారు. జగన్ జమానాలో టీటీడీని ఏలిన ఆయన అనుంగులు, శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూని కూడా భ్రష్టు పట్టించేశారు. రూపమూ రుచీ కూడా పోయాయి. గిల్లుడుకు గురై లడ్డూ సైజు తగ్గిపోయేది. తిరుమల లడ్డూకి దశాబ్దాలుగా వారసత్వంగా వస్తున్న పరిమళం కూడా మాయమైపోయింది. అసలు ఇది తిరుపతి లడ్డేనా అనే అనుమానం కలిగేలా మారిపోయింది. అందుకు కారణం లడ్డూ తయారీకి వాడుతున్నది కల్తీ నెయ్యి కావడం అని తేలింది. అసలు అది నెయ్యే కాదనీ, జంతుకొవ్వు అవశేషాలున్నాయని తేలడంతో సకల భక్త ప్రపంచాన్నీ ఆందోళనకు గురైంది. కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. సుప్రీంకోర్టు జోక్యంతో సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. కల్తీ నెయ్యిని సరఫరా చేసిన కొన్ని సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. కొందరిని అరెస్ట్ చేయడంతో పాటు మరికొందరిని విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలోస్వచ్ఛమైన నెయ్యితోనే లడ్డూలను తయారు చేయడం తిరిగి మొదలుపెట్టారు. దీంతో ఒకప్పటి వాసన తిరిగి వచ్చింది. గతంలో పోలిస్తే ప్రస్తుతం లడ్డూల రుచి చాలా బాగుందని వీఐపీల నుంచి సాధారణ భక్తుల వరకు ప్రసంశలు కురిపిస్తున్నారు. అలాగే నెయ్యిని పూర్తిస్థాయిలో పరీక్షించేలా తిరుమల ల్యాబ్‌లో 'గ్యాస్ క్రోమోటోగ్రాఫీ(జీసీ), హైపెర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రాఫీ' అనే రెండు అత్యధునిక పరికరాలను అమర్చారు.



గతంలో తిరుపతి లడ్డూ ఉన్న చోట నెయ్యితో కూడిన సువాసన గుభాళించేది. అది పోయింది. రెండుమూడు రోజులకే పాడయ్యేవి. ఇప్పుడు లడ్డూకి తిరిగి పాత రుచి, వాసన వచ్చాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంటున్నాయి. లడ్డూ పట్టుకుంటే నెయ్యి చేతికి అంటుతోంది.

- మురళీకృష్ణ, గుంటూరు



■ దర్శనం ఉంటేనే వసతి

తిరుమలలో ప్రశాంతంగా ఒకరోజు గడపాలంటే గతంలో కుదిరేది కాదు. వైసీపీ పాలనలో రెకమండేషన్ ఉంటేనే వసతి దొరికేది. బ్లాక్ వ్యాపారం విచ్చలవిడిగా సాగేది. మఠాలు కూడా లాడ్జీల్లా మారిపోయి డబ్బు చేసుకునేవి. ఈ ఏడాదిలో వసతి పొందే పద్ధతుల్లో అనేక మార్పులు జరిగాయి. నకిలీ ఆధార్‌లతో గదులను బ్లాక్‌లో అమ్ముతున్న ముఠాలను గుర్తించి కేసులు పెట్టారు. దర్శనం టికెట్ లేదా టోకెన్ ఉన్నవారికే ఇప్పుడు తిరుమలలో వసతి దొరుకుతోంది. గది తీసుకున్న వారే ఖాళీచేయాలనే నిబంధన పెట్టారు. ముఖగుర్తింపును ప్రవేశపెట్టడంతో బ్లాకువీరులకు గండిపడింది. ఖాళీ అయ్యేదాకా కొంత వేచి ఉండాల్సి వస్తోంది కానీ ఇప్పుడు తిరుమలలో వసతి దొరుకుతోందనే అభిప్రాయం భక్తుల్లో కలుగుతోంది.



మారిన అన్నప్రసాదాలు



ఇప్పుడు ఇంట్లో తింటున్న భావన కలుగుతోంది. గతంలో అన్నం గట్టిగా ఉండేది. స్వామి ప్రసాదం కావడంతో తప్పు పట్టకూడదని ఓ రెండు ముద్దలు తినేసి వెళ్లిపోయేవాళ్లం. ఇప్పుడు సాంబారు, రసం, చెట్నీ.. అన్నీ రుచిగా ఉన్నాయి. వడ కూడా పెడుతున్నారు. స్వామి దర్శనం చేసుకున్నంత తృప్తిగా తింటున్నాం.

- శిరీష, వైజాగ్



శ్రీవారి అన్నప్రసాదాల నాణ్యతలోనూ ఏడాదిలో చాలా మార్పులు వచ్చాయి. వైసీపీ పాలకమండళ్ల కాలంలో దీనిపై వచ్చిన విమర్శలు అన్నీఇన్నీ కావు. 'అసలు ఇది అన్నమేనా, ఎలా తినాలి. మనుషులమా, పసువులమా. కమీషన్లు తీసుకుని చెత్త భోజనం పెడుతున్నారు. మీ ఇంట్లో కూడా ఇలాంటి అన్నమే తింటారా, ఆకలితోనే లేచేశాం' అంటూ అన్నప్రసాదాలపై తీవ్ర ఆవేదన చెందారు. గత ప్రభుత్వంలో ఆర్గానిక్ నైవేద్యం అంటూ రుచి, నాణ్యతలేని అన్నప్రసాదాలను పెట్టేవారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ ఈవో, అదనపు ఈవోలు దీనిమీద శ్రద్ధ పెట్టారు. బియ్యం సరఫరా చేసే మిల్లర్లతో పాటు కూరగాయలు సరఫరా చేసే రైతులతో వరుస సమీక్షలు నిర్వహించారు. నాణ్యమైన బియ్యం, కూరగాయలు, ముడిసరులకు వచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు పూర్వపు పద్ధతులనే అనుసరిస్తంన్నారు. దీంతో ప్రస్తుతం భక్తులు అన్నప్రసాదాల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేవుడికీ నైవేద్యం దిట్టం పెంచి భక్తులకూ స్వామి నైవేద్య ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

దర్శనాల దందా తగ్గింది



తిరుమలలో రాజకీయ నాయకుల ఆర్భాటపు దర్శనాలు తగ్గాయి. వీఐపీ బ్రేక్ దర్శనాలు మునుపటిలాగే ఉన్నా, నాయకుల గుంపులు కనిపించడంలేదు. మరీ కొందరు వైసీపీ నాయకులైతే వారం తిరక్కుండానే కొండమీద తమ బృందాలతో కనిపించేవారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించేవారు. జిల్లాకు చెందిన మంత్రులకైతే రోజుకు 30 నుంచి 40 వీఐపీ బ్రేక్ దర్శనాలు కూడా కేటాయించేవారు. టికెట్ల బ్లాక్ అమ్మకాలు ఎక్కువయ్యాయనే విమర్శలూ ఉండేవి. బోర్డు సభ్యులే దుకాణాలు తెరిచేశారని ఆరోపణలు హోరెత్తేవి. ఫలితంగా సాధారణ భక్తులకు చుక్కలు కనిపించేవి. గంటలకు గంటలు పడిగాపులు తప్పేవి కావు. క్యూలైన్లలో వీరికి అన్నపానీయాలు సరిగా అందడంలేదనే విమర్శలుండేవి. ఈ ఏడాదిలో చాలా మార్పులు జరిగాయి. బ్లాక్ మార్కెట్ దాదాపుగా అరికట్టారు. దాదాపు వెయ్యి మందిపై కేసులు నమోదు చేశారు. వీఐపీలకు టికెట్ల కేటాయింపు పరిమితిని బాగా కుదించారు. క్యూలైన్‌లలో చంటిపిల్లలకు తిరిగి పాలు అందిస్తున్నారు. సులభంగా తక్కువ సమయంలో దర్శనం అయ్యేందుకు ఏఐ ఆధారిత వ్యవస్థను ఉపయోగించుకోవాలని టీటీడీ భావిస్తోంది.

'ఉచిత టోకెన్ తీసుకుని వచ్చాం. రెండు గంటల్లోనే దర్శనం పూర్తయింది. సెలవులు కదా ఎక్కువ సమయం పడుతుందేమో అనుకున్నాం. కానీ త్వరగానే బయటకు వచ్చేశాం. తోపులాటలు కూడా ఎక్కడా కనిపించలేదు. ఎక్కడిక్కడ అన్నప్రసాదాలు, మజ్జిగ, పాలు ఇస్తున్నారు.

- వెంకటలక్ష్మీ, విజయవాడ



కుల ధృవీకరణ పత్రాల్లో 'హిందూ' అనే పదం తొలగింపు

● సరికాదన్న బీజేపీ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాల, కళాశాలల్లో చదువుకుంటు న్న విద్యార్థులకు ఇస్తున్న కులధ్రుకరణ పత్రాల్లో 'హిందూ' అనే పదాన్ని తొలగించడం సరికాదని బీజేపీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు, కోవై వెస్ట్ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ అభిప్రాయపడ్డారు. దేశానికి వచ్చినప్పటి నుండి విద్యార్థులకు ఇస్తున్న కులధ్రువీకరణపత్రాల్లో వారి కులంతో పాటు హిందూ, క్రిస్టియన్, ముస్లిం తదితర మతాలు కూడా ఉండేవి. ఈ నేపథ్యంలో, ఇటీవల కాలంగా ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు పొందుతున్న కులధ్రువీకరణ పత్రాల్లో హిందూ అనే పదం లేకుండా వారి కులంపేరు, బీసీ, ఎంబీసీ, ఈబీసీ అని మాత్రమే నమోదు చేయడంపై వానతీ శ్రీనివాసన్ తప్పుబట్టారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, హిందూ అనే పదం తొలగించడంవల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొందని, హిందూ మతం అన్ని కులాలను సమానంగా చూస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ కల్పిస్తోందని, అయితే డీఎంకే ప్రభుత్వం విద్యార్థులకు నష్టం కలిగించే విధంగా తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు.

అంగన్వాడీ భవనం ప్రారంభం

తిరుత్తణి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు మండలం బొమ్మరాజుపేటలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని శుక్రవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ఆల్ విలేజ్ అన్నా మరుమలార్చి పథకం కింద రూ.15.29 లక్షలతో నూతన అంగన్వాడీ కేంద్రం, కుమారరాజుపేటలో రూ.15.29 లక్షల తో మరో భవన నిర్మాణం పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పళ్లిపట్టు సౌత్ కార్యదర్శి రవీంద్ర, సెంట్రల్ యూనియన్ కార్యదర్శి బీడీ చంద్రన్, కౌన్సిలర్లు నదియా నాగరాజ్, పంచాయతీ అధ్యక్షుడు నేతాజీ, గ్రామస్థులు కుమరేశన్, గోవిందస్వామి, గోపి, భారతి తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

పారిశ్రామికవేత్త ఇంట్లో ఈడీ తనిఖీలు

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం లేక్ అవెన్యూలో నివసిస్తూ మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ పారిశ్రామికవేత్త ఇంట్లో ఈడీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ముత్తు అనే ఆ పారిశ్రామికవేత్త నివాసానికి ఉదయం 7గంటలకు సీఐఎస్ఎఫ్ బలగాల భద్రతతో వెళ్లిన నలుగురు ఈడీ అధికారులు ముత్తు, ఆయన సతీమణి వద్ద మనీల్యాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలపై విచారణ జరిపినట్లు సమాచారం.

త్రిపుర మహిళల కిడ్నాప్: ఇద్దరి అరెస్టు

అడయార్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులో త్రిపురకు చెందిన ఇద్దరు మహిళల కిడ్నాప్ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి, వారి చెరలో ఉన్న ఇద్దరు మహిళలకు విముక్తి కల్పించారు. నెర్కుంద్రంలోని తమ స్నేహితులను కలిసేందుకు త్రిపుర నుంచి 23, 26 ఏళ్ల ఇద్దరు మహిళలు నగరానికి వచ్చారు. వీరికి మాయమాటలు చెప్పి ఒక ముఠా కిడ్నాప్ చేసింది. అయితే, మార్గమధ్యంలో ఒక యువతి కారులో వాంతులు వస్తున్నాయని చెప్పడంతో కిడ్నాపర్లు కారు ఆపారు. దీంతో ఆ మహిళ తప్పించుకుని పారిపోయి కోయంబేడు పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆ వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ ఫుటేజీ ఆధారంగా కిడ్నాపర్లను అరెస్టు చేసి, వారి చెరలో ఉన్న మరో మహిళను కూడా రక్షించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నడిగర్ సంఘం పేరుతో రూ.40 లక్షల మోసం !

● ముగ్గురిని విచారిస్తున్న పోలీసులు

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని దక్షిణ భారత నడిగర్ సంఘం పేరుతో నకిలీ సంస్థ నడిపి, రూ.40లక్షలు మోసం చేసిన సంఘ మాజీ మేనేజర్ సహా ముగ్గురిని పోలీసులు విచారిస్తున్నారు. నడిగర్ సంఘం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తేనాంపేట పోలీసులు కేసు నమోదు చేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘ మాజీ మేనేజర్ బాలమురుగన్, శంకర్ బాబు, సతీష్‌కుమార్‌లను విచారించగా పలు వాస్తవాలు వెలుగు చూశాయి. 'ఎవర్ గ్రీన్ మీడియా' అనే సంస్థను దక్షిణ భారత నడిగర్ సంఘం నిర్వహిస్తోందని సంఘ సభ్యులను నమ్మించి వసూలు చేసిన రూ.40 లక్షలకు పైగా కాజేసినట్లు విచారణలో తెలిసింది. ఈ సంఘటన తమిళ చిత్రరంగంలో కలకలంరేపింది.

మాజీమంత్రి సెంథిల్ బాలాజీకి హైకోర్టు నోటీసు

ప్యారీస్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ)కి ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసిన వ్యవహారంలో అప్పటి విద్యుత్‌శాఖ మంత్రిగా వ్యవహరించిన సెంథిల్ బాలాజీ వివరణ కోరుతూ మద్రాస్ హైకోర్టు శుక్రవారం నోటీసులిచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు వ్యవహారంలో జరిగిన అవినీతికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ జరపాలంటూ ఏసీబీని ఆదేశించాలని అరప్పోర్ ఇయ్యక్కం మద్రాస్ కోర్టులో పిటిషన్ వేసింది. అందులో 2021 నుండి 2023 మధ్యకాలంలో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీ టీఎన్ఈబీ కోసం 40,800 ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేసేందుకు టెండర్లు ఆహ్వానించారని తెలిపారు. టెండర్ల పరిశీలనలో సంబంధిత కాంట్రాక్టర్లు ఆర్థికంగా లబ్దిపొందేలా వ్యవహరించిన సెంథిల్ బాలాజీ ప్రభుత్వానికి రూ.397 కోట్ల నష్టం కలిగించారని ఆ పిటిషన్‌లో వివరించారు. సెంథిల్ బాలాజీ, టాన్‌జెట్కో ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ లఖానీ తదితరులకు ఈ అవినీతిలో సంబంధాలున్నట్లు ఆధారాలు కూడా ఉన్నాయని అందువల్ల వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాల్సిందిగా ఏసీబీకి ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందుకు విచారణకు రాగా, వివరణ సమర్పించాలంటూ సెంథిల్ బాలాజీకి నోటీసులిచ్చిన న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణ జూలై 3వ తేదీకి వాయిదా వేశారు.